క్లుప్తంగా

ఆబోతును రక్షించిన మున్సిపల్ సిబ్బంది



డ్రైన్‌లో పడిన ఆబోతును జేసీబీ సాయంతో బయటకు తీస్తున్న సిబ్బంది

అమలాపురం టౌన్: స్థానిక సర్క్యులర్ బజార్ సమీపంలో ఓ లోతైన డ్రైన్‌లో ఆబోతు ప్రమాదవశాత్తూ పడిపోయింది. దీంతో వెంటనే మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు స్పందించారు. బుధవారం ఉదయం ఆబోతు డ్రైన్‌లో పడిన సమాచారం అందుకున్న ఆయన అక్కడకు చేరుకుని సిబ్బందికి పలు సూచనలు చేశారు. జేసీబీని రప్పించి ఆబోతును బయటకు తీయించారు. కమిషనర్ నాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబుతో పాటు మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఆబోతును బయటకు తీసుకువచ్చేందుకు శ్రమించారు.

వలంటీర్‌కు అభినందన

అల్లవరం: కొమరగిరిపట్నం సచివాలయం-1 పరిధిలో అనారోగ్యంతో ఉన్న మహిళ సరెళ్ల నాగమణిని రామచంద్రపురంలో మంగళవారం నిర్వహించిన సదరన్ క్యాంప్‌కు తీసుకెళ్లి పరీక్షలు చేయించి ఇంటికి తీసుకొచ్చిన వలంటీర్ జె.సత్యను ఎంపీడీఓ జి.సరోవరరావు అభినందించారు. గ్రామ సచివాలయ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సమక్షంలో బుధవారం అభినందించారు. సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ప్రతినిధులకు సన్మానం



సహకార సంఘాల ప్రతినిధులను సత్కరిస్తున్న సీఈఓలు, పాలకవర్గ సభ్యులు

అల్లవరం: కొమరగిరిపట్నంలోని సొసైటీ కార్యాలయంలో బుధవారం జిల్లా సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు యర్రంశెట్టి రామచంద్రరావు, కొమ్మూరి సత్తిబాబులను పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. సొసైటీ అధ్యక్షుడు గుర్రం బాబులు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, సొసైటీ సీఈఓలు అభినందించారు. సొసైటీ డైరెక్టర్లు బొంతు సత్యనారాయణ, పులుసుగంటి గంగాధర్, సొసైటీ సీఈఓలు సత్తి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి సత్యనారాయణ, ఆకుల సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

రేపు ఐ.పోలవరంలో జాబ్‌మేళా

ముమ్మిడివరం: ఐ.పోలవరం ఎంఎంఎస్ కార్యాలయంలో ఈ నెల 3న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోక్‌మాన్ తెలిపారు. ముత్తూట్, మోహమ్ స్పిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సుమారు 110 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశముందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీడీఎం, ఫామ్‌సీ, డిప్లొమో విద్యార్థులు అర్హులన్నారు. జీతం రూ.13 వేల నుంచి రూ.20 వేల వరకూ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, ఆధార్, ఐడీ అండ్ అడ్రస్ ప్రూఫ్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

ప్రయోగాలతో సృజనాత్మకత

యానాం: సైన్స్ ప్రయోగాలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చని ప్రిన్సిపాల్ పి.రాజేష్ అన్నారు. బుధవారం స్థానిక నారాయణ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ ఎగ్జిబిట్స్ అందరినీ ఆలోచింపజేశాయి. సుంకరపాలెం నల్లం హైస్కూల్ ప్రాంగణంలో సైన్స్ సంబరాలు నిర్వహించారు. వర్తక సంఘ గౌరవాధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సైన్స్ ప్రాజెక్టులు, క్విజ్ కాంపిటేషన్ విజేతలకు చైర్మన్ నాగబాబు బహుమతులు అందించారు. హెచ్ఎం డి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ఉప్పలగుప్తం: విలసవిల్లి, ఉప్పలగుప్తం గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఏడీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం పశువులకు గోరుగుంట్ల వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమం రోజుకో గ్రామంలో జరుగుతుందని మండల పశు వైద్యాధికారి ఎం.నిరూష తెలిపారు. జేవీఓ కేవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐ.పోలవరం: మురమళ్ల, ఐ.పోలవరంలలోని 33 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం పలు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోకా రవికుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

వినియోగం ఎప్పటికో?

- పిచ్చిమొక్కలతో నిండిన ఆర్టీసీ బస్టాండ్
- అలంకార ప్రాయంగా మారిన వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న ముమ్మిడివరం ఆర్టీసీ బస్టాండ్

ముమ్మిడివరం: పేరుకే బస్టాండ్... అక్కడికి ఒక్క బస్సూ రాదు. పోదు. నగర పంచాయతీ అయినా ఆర్టీసీ బస్టాండ్ రూపురేఖలు వెక్కిరిస్తున్నాయి. అధికారుల వైఖరిని ప్రశ్నిస్తున్నాయి. ముమ్మిడివరంలో ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణకు ఆమడ దూరంలో ఉంది. ఫలితంగా ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. బస్సుల కోసం గంటల తరబడి రోడ్ల పక్కనే పడిగాపులు పడాల్సి వస్తోంది. గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతో ఈ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. 1996లో ముమ్మిడివరంలో ఏపీఎస్ ఆర్టీసీ రూ.25 లక్షలతో అన్ని హంగులతో ఈ బస్టాండ్‌ను నిర్మించింది. ఇక్కడ కంట్రోల్ రూం, రిజర్వేషన్ కౌంటర్, ప్రయాణికుల సౌకర్యార్థం మంచినీటి కుళాయి, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించారు. 216 జాతీయ రహదారిని ఆనుకుని ఉండటంతో ఎప్పుడూ రద్దీగా ఉండేది. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు వెలవెలబోతోంది. అమలాపురం, రాజోలు డిపోల నుంచి కాకినాడ, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం వంటి జిల్లాలకు ముమ్మిడివరం మీదుగా బస్సులు నడుస్తున్నాయి. దీని ద్వారా ఆర్టీసీకి రోజూ రూ.లక్షల ఆదాయం సమకూరుతోంది. బస్టాండ్ లోపలకు, బయటకు వెళ్లే గేట్ల వద్ద ఆనుకుని ఉన్న రహదారులు అధ్వానంగా మారడంతో బస్సులు లోపలకు వచ్చేవి కావు. నగర పంచాయతీ నిధులతో ఏడాది కిందట ఆ రహదారులు ఆధునీకరించారు. అయినా బస్టాండ్ మాత్రం వినియోగంలోకి రావడం లేదు. ఈ ఆవరణ అంతా నిర్మానుష్యంగా మారింది. పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో అధ్వానంగా దర్శనమిస్తుంది. చూడ్డానికీ రోత పుడుతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారింది.

రోడ్లపైనే పడిగాపులు

ప్రయాణికులు ఎండైనా, వానైనా రోడ్డుపై బస్సు కోసం వేచిచూడాల్సి వస్తోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో నానా తంటాలు పడుతున్నారు. ఇక వర్షం వస్తే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. విద్యార్థులు, ప్రజలు బస్సుల కోసం ఎక్కడ నిలబడాలో తెలియని పరిస్థితి. ఒక్కోసారి విద్యార్థులు బస్సుల కోసం రోడ్లపై ఉరుకులు, పరుగులు తీయడంతో ఏ క్షణాన్న ఏం జరుగుతుందోనని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

కనీసం నిలుచోలేం..



రూ.లక్షలు వెచ్చించి బస్టాండ్ నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ప్రయాణికులు ఇక్కడ నిలుచుని ఉండేందుకు కూడా ఇష్టపడడం లేదు నిర్వహణ లేక కంపు కొడుతోంది.

–రేకాడి వర్మ, ముమ్మిడివరం

నిరీక్షణ తప్పడం లేదు



బస్సుల కోసం జాతీయ రహదారి పక్కన గంటల కొద్దీ నిరీక్షిస్తున్నాం. ఎండకు, వానకు తడుస్తూ ఎదురు చూస్తున్నాం. రాత్రి సమయంలో మరీ ఇబ్బంది పడుతున్నాం. వేగంగా వెళ్లే వాహనాలతో ఎప్పుడు ఏ ఇబ్బంది వస్తుందోనని ఆందోళన చెందుతున్నాం.

–కాత్రు వరలక్ష్మి, అయినాపురం

సీఎం జగన్‌ను కలసిన మునికుమారి



నిడదవోలులో సీఎం జగన్‌తో మాట్లాడుతున్న కాశి బాలమునికుమారి

ముమ్మిడివరం: నిడదవోలుకు వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని హితకారిణి సమాజం చైర్‌పర్సన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు కాశి బాల మునికుమారి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు రెండో సారి పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కైట్‌లో 'శాస్త్ర' ప్రారంభం



కైట్‌లో సాంకేతిక పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

తాళ్లరేవు: కోరంగి కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నికల్ ఈవెంట్ శాస్త్ర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్ర (సైంటిఫిక్ అప్రోచ్ ఫర్ సోషల్ అండ్ టెక్నాలజికల్ రీసెర్చ్ ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్) అనే కార్యక్రమాన్ని వారం రోజుల పాటు నిర్వహిస్తున్నారు. తొలిరోజు ఐదు రకాల సాంకేతిక అంశాలపై విద్యార్థినులు ప్రదర్శనలు ఇచ్చారు. కైట్ కళాశాల విద్యార్థులతో పాటు జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరై తమ ప్రతిభను కనబరిచారు. ప్రిన్సిపాల్స్ యేడిద రామకృష్ణ, దూబే రేవతి, గోపి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు శ్రీకారం



స్వామివారి కల్యాణోత్సవాలకు ముహూర్తపు రాట వేస్తున్న చైర్‌పర్సన్ విరీతాదేవి, ధర్మకర్తలు

అమలాపురం టౌన్: అమలాపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 28 నుంచి 12 రోజుల పాటు జరిగే స్వామివారి కల్యాణోత్సవాలకు బుధవారం ఉదయం ముహూర్తపు రాట వేశారు. ఆలయ ప్రాంగణంలో పందిరి రాటకు పూజలు చేసి ఉత్సవాలను ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి ప్రారంభించారు. ఈ ఏడాది స్వామివారి దివ్య కల్యాణాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ దూనబోయిన సాయిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ అభివృద్ధి ప్రోత్సాహకర్త యెందూరి నాగేశ్వరరావు, ధర్మకర్తలు నడింపల్లి వర్మ, సంసాని అబ్బు, యెందూరి రాఘవ, కాశే ఆదిపట్టాభి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



పి.మల్లవరం జెడ్పీ హైస్కూల్‌లో తనిఖీ చేసి మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తాళ్లరేవు: మండలంలోని పలు పాఠశాలలను సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజడ్ ఆఫీసర్, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైభీమ్‌పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పి.మల్లవరం జెడ్పీ హైస్కూళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. పోలేకుర్రు పంచాయతీ జైభీమ్‌పేటలో సమగ్ర శిక్ష ద్వారా నిర్వహించే ఫిజియోథెరపీ కేంద్రాన్ని పరిశీలించి ప్రత్యేక అవసరాల గల పిల్లలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఫిజియోథెరపీ వైద్యులు మారుతి, సీఆర్‌పీ తరాల మీరాసాహెబ్, ఐఈఆర్‌టీ ఆశీర్వాదం తదితరులు ఉన్నారు.

వైభవంగా మరిడమ్మ జాతర



వడ్డిగూడెం మరిడమ్మ జాతరలో గరగ నృత్యాలు

ముమ్మిడివరం: ఠానేల్లంక శివారు వడ్డిగూడెంలో మరిడమ్మ వారి జాతర, తీర్థ మహోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. గరగ నృత్యాలు, బాజా భజంత్రీలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి జాతర నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై కె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మాల మహానాడు కార్యాలయం ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో రాష్ట్ర మాల మహానాడు ప్రాంతీయ కార్యాలయాన్ని దళిత నాయకుడు చిల్లా పురుషోత్తం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు జగడం సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని మాలలందరినీ ఏకతాటిపైకి తెచ్చి వారిని విద్యా, సామాజిక రంగాల్లో చైతన్యపరిచేందుకు కృషి చేస్తామన్నారు. దళిత నాయకులు తిరుపతిరావు, పులపర్తి వెంకటేశ్వరరావు, పోతుల రవికుమార్, కిత్తనచెరువు గ్రామ సర్పంచ్ సత్యనారాయణ, రాష్ట్ర బేడ బుడగ సంఘం జిల్లా అధ్యక్షుడు పేర్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రోబోటిక్ వర్క్‌షాప్



రిమోట్ కంట్రోల్ రోబో వెహికల్‌ను పరిశీలిస్తున్న సభ్యులు

ఐ.పోలవరం: జి.వేమవరం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం రోబోటిక్ వర్క్‌షాప్ జరిగింది. దీనిని విద్యా కమిటీ చైర్మన్ మెండా బులిరాజు ప్రారంభించారు. విద్యార్థులు పలు రకాల రోబోలను తయారు చేసి ప్రదర్శించారు. హోటల్స్, మాల్స్, ఆఫీస్‌లలో సర్వింగ్‌కు రోబో, జాయిస్టిక్ రోబో, రిమోట్ కంట్రోల్ వెహికల్, చిన్న ట్రాలీ, డ్రైవర్ లేని వెహికల్ తదితర ప్రాజెక్టులు తయారు చేసి ఆకట్టుకున్నారు. సలాది వెంకటనారాయణ, రాయపురెడ్డి బుజ్జి, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొబ్బరి సంకరీకరణపై శిక్షణ

అంబాజీపేట: కొబ్బరి సంకరీకరణలో భాగంగా కొబ్బరి చెట్లపై ఉండే ఆడ పుష్పాలపై పుప్పొడిని గాలి పీడనం ద్వారా వెదజల్లాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు అన్నారు. అంబాజీపేట డాక్టర్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో కొబ్బరి సంకరీకరణపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమం మూడో రోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కొబ్బరి సంకరీకరణలో పొత్తుల నుంచి మొగ పుష్పాలను వేరు చేయడం, బ్యాగింగ్, పరాగ సంపర్కం, పుప్పొడి జీవము, మొలక నిర్ధారణ అంశాలపై వివరించారు. హార్టీకల్చర్ శాస్త్రవేత్త ఎ.కిరీటి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ జి.కోటేశ్వరరావు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సింహ వాహనోత్సవం



యానాంలో సింహ వాహనోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు



శ్రీరంగనాయకపురంలో సీతారాముల శాంతి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

యానాం: యానాంలో వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా 9వ రోజు బుధవారం సింహ వాహనోత్సవం అట్టహాసంగా జరిగింది. యానాం ఉపాధ్యాయ సంఘం ఉత్సవ దారులుగా నిర్వహించిన ఈ వేడుకలో నియోజకవర్గ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు. తొలుత స్వామివారికి సంకల్పం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శారదా ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల టీచర్లు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి, ఆంజనేయ స్వామికి నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం సింహ వాహనంపై స్వామివారిని అధిరోహింపజేసి పురవీధులలో ఊరేగించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామి తదితరులు వాహనోత్సవాన్ని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు, వినోదాచార్యులు, పెద్దింటి సాయిరామకృష్ణ తదితరులు పూజలు చేశారు.

స్కూళ్ల మూసివేత

యానాం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సింహ వాహనోత్సవం పేర నియోజకవర్గంలోని పాఠశాలల అన్నింటినీ అనుమతి లేకుండా బుధవారం మధ్యాహ్నం మూసివేయడంపై పలువురు తల్లిదండ్రులు అధికారులను ప్రశ్నించారు. ఉత్సవాలకు స్కూల్‌కు ఒక టీచర్‌ను పంపినా బాగుండేదని కాని మొత్తం స్కూల్స్ మూసివేశారన్నారు.

కోదండ రాముని విగ్రహ ప్రతిష్ఠ

తాళ్లరేవు: తాళ్లరేవు శివారు శ్రీరంగనాయకపురంలోని కోదండ రామాలయంలో ఉదయం సీతా పరివార సమేత శ్రీరామచంద్రమూర్తి, గణపతి, సరస్వతీ దేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉదయం 8.30 గంటలకు ఏకశిలా ధ్వజ స్తంభాన్ని క్రేన్ సహాయంతో ప్రతిష్ఠించారు. తొలుత స్వామివారి దర్శనం గోవుకు చేయించి, అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేద పండితుడు వెంకటేశ్వరశర్మ నేతృత్వంలో పూజలు జరిగాయి. ఆలయ నిర్మాణకర్త మంతెన భువనేశ్వరీవర్మ ఆధ్వర్యంలో ఐదుగురు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం జరిగింది. మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీపీ రాయుడు సునీత, కేశవస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ కొల్లు శ్రీను, నాయకులు రాయుడు గంగాధర్, కొపనాతి నాగరాజు, ఆకుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: బండారులంక నారాయణరావుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు దంగేటి వీరవెంకట సత్యనారాయణ, దేవమణి దంపతులచే పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిగింది.

ఉప్పలగుప్తం: లోక కల్యాణార్థం ఉప్పలగుప్తంలో నామన రవీంద్రనాథ్ ఇంటి వద్ద గో, వృషభ కల్యాణం నిర్వహించారు. నామన రామకృష్ణ, కనకదుర్గ, నామన లక్ష్మణరావు, మంజుల భాను దంపతులు పాల్గొన్నారు.

ఇంటికొచ్చి.. పింఛను ఇచ్చి



ఓ వృద్ధురాలికి పింఛను సొమ్ము అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: తెలవారుతున్న వేళ వలంటీర్లు ఇంటి కొచ్చి మరీ పింఛన్లు అందజేశారు. ఉదయం 4.30 గంటల నుంచి 6 గంటలలోపు తమ పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్ల అందజేసే కార్యక్రమాన్ని దాదాపు ముగించారు. అందుబాటులోని కొందరికి మాత్రం సాయంత్రం లోపు అందజేశారు. అమలాపురం మున్సిపాలిటీలోని 15 వార్డు సచివాలయాల పరిధిలో మొత్తం 4,550 పింఛన్లు ఉన్నాయి. వీరికి మొత్తం రూ.1,27,19,250 పంపిణీ చేయాల్సి ఉండగా ఒకటో తేదీ బుధవారం ఒక్క రోజునే 3,890 మంది పింఛనుదారులకు రూ.1,08,55,750 అందజేశారు. మొత్తం 85.49 శాతం మేర పింఛన్ల పంపిణీని పూర్తి చేశారు. పట్టణంలో 267 మంది వలంటీర్లు వేకువజాము నుంచే పింఛన్ల పంపిణీలోనే నిమగ్నమయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణితో పాటు వార్డు కౌన్సిలర్లు సంసాని బులినాని, బండారు గోవిందు, యండమూరి గంగ, నాగారపు వెంకటేశ్వరరావు తదితరులు ఈ పంపిణీని స్వయంగా పర్యవేక్షించారు. ఆయా వార్డుల్లో కౌన్సిలర్ల చేతుల మీదుగా ఈ పంపిణీ జరిగింది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల చేతుల్లో పింఛన్ సొమ్ములు పెడుతున్నప్పుడు లబ్ధిదారుల కళ్లలో కనిపించే ఆనందం తమకు చాలా తృప్తిగా ఉంటుందని పలువురు వలంటీర్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, మున్సిపల్ కార్యాలయ పింఛన్ల పంపిణీ పర్యవేక్షకుడు నాగబాబు వలంటీర్లకు ముందే పింఛన్ల సొమ్మును అందించడంతో వేకువ జామునే పంపిణీ సజావుగా సాగింది.

ఘనంగా లూర్థుమాత యాత్రా మహోత్సవం



లూర్థుమాత కొండ గుహ వద్ద జరిగిన ప్రార్థనల్లో భక్తులు

యానాం: యానాంలో లూర్థుమాత యాత్రా మహోత్సవం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. రోమన్ కేథలిక్ చర్చి ఆవరణలో లూర్థుమాత కొండగుహ వద్ద ఫాదర్ తోమాస్ పులికల్, వర్గీస్ కొల్లంపరంబిల్, ఒమ్మి మోహన్‌ప్రసాద్, పాలుకున్నెల్, మరియదాసు తదితరులు మహోత్సవ వాక్య పరిచర్య, స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పరిశుద్ధ లూర్థమాత స్వరూపంతో జరిగిన పుర ప్రదక్షిణలో వేలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. రోమన్ కేథలిక్ చర్చిని, కొండ గుహను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అదేవిధంగా విచారణ గురువులు, మఠకన్యలు తదితరులు పాల్గొన్నారు. యానాం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రతి ఇంటికీ తాగునీరు లక్ష్యం



జల్ జీవన్ మిషన్ పథకంపై అవగాహన కల్పిస్తున్న అమలాపురం కోఆర్డినేటర్ రమేష్

అమలాపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంట్లో వ్యక్తికి 55 లీటర్ల తాగునీటిని కుళాయిల ద్వారా అందించడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నాయని జల్‌జీవన్ మిషన్ అమలాపురం కోఆర్డినేటర్ ఎం.రమేష్ అన్నారు. జనుపల్లిలో గ్రామ సర్పంచ్ గుణాల భారతి అధ్యక్షతన ఈ పథకంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి విషయంలో జాగ్రత్తలు పాటించకపోతే భవిష్యత్తు తరాలు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. అనంతరం జల్‌జీవన్ మిషన్, ఐఎస్ఏ, కోనసీమ సేవా మండలి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి శిరీషారెడ్డి, సుజ్ఞాని, సచివాలయ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

మహిళ మృతదేహం



యానాంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

యానాం: స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలో బుధవారం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని కనుగొన్నట్లు ఎస్సై శేరు నూకరాజు తెలిపారు. 55- 60 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని, 5.5 అడుగుల ఎత్తు ఉన్నట్లు వివరించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని స్థానిక జీజీహెచ్ మార్చురీలో ఉంచామన్నారు. వివరాలు తెలిసిన వారు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నంబరు 0884-2321210, పోలీస్ స్టేషన్ 0884-2321233కు ఫోన్ చేయాలని కోరారు.

గంజాయి కేసులో ముగ్గురికి రిమాండ్

కాట్రేనికోన: చెయ్యేరులో గంజాయిని విక్రయించడంతో పాటు, తాగుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు కాట్రేనికోన ఎస్సై టి.శ్రీనివాస్ తెలిపారు. నిందితులు సత్యసురేంద్రబాబు (క్రాంతి), నవీన్‌కుమార్ (బన్ని), రాజేష్‌లను అరెస్టు చేసి వారి నుంచి 30 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. బుధవారం ముమ్మిడివరం కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు చెప్పారు.

వ్యక్తిపై కేసు నమోదు

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం రోళ్లపాలెంలో ఉన్న ఓ రోడ్డు స్థలం తనదంటూ అదే గ్రామానికి చెందిన రాయుడు వెంకటరమణ రోడ్డుపై వాహనాలు అడ్డుకున్నాడన్న అభియోగంపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై జి.హరీష్‌కుమార్ తెలిపారు. రోడ్డు ఉన్న స్థలం తన జిరాయితీ భూమి అని వెంకటరమణ వాదిస్తూ సమీపంలో పనులు చేసుకుంటున్న మైత్రీ డెవలపర్స్‌కు చెందిన వాహనాలను బుధవారం అడ్డుకున్నారు. దీనిపై ఆ డెవలపర్స్ యాజమాని గారపాటి వీరవెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటరమణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. రోడ్డుకు స్థలాన్ని తమ కుటుంబీకులు కేటాయించినట్లు గాని, ఈ మేరకు స్థానిక పంచాయతీలో ఎలాంటి తీర్మానం చేసినట్లు గాని ఎక్కడా లిఖిత పూర్వక పత్రాలు లేవని రాయుడు వెంకటరమణ దంపతులు ఇటీవల అమలాపురం కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు అందించారు. అలాగే మైత్రీ డెవలపర్స్ యాజమాన్యంపై జిల్లా ఎస్పీ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశారు.